


# పార్వతి తపస్సు

వాసిరెడ్డి కాశీరత్నం

ముత్తైదువుల తలల్లోని మల్లెలు ఒక్కొక్కటే విచ్చేకొద్దీ పార్వతి హృదయం ముడుచుకుపోతున్నది.

సరిగంచు చీరెలూ, రత్నాభరణాల కాంతులూ, గాజుల గలగలలూ, స్త్రీల పరిహాసాలూ ఇవేవీ ఆమెను ఆకర్షించలేక పోయాయి. పరిశీలించి చూస్తే ఆమె మొహంమీద నవ వధువుకుండవలసిన నునుసిగ్గు దొంతరలూ, చిరుహాస రేఖలూ కాక భయాందోళనలు కనవడతున్నాయి. బాధాకరమైన సన్నివేశానికి సన్నద్ధ మవుతున్నట్లు పార్వతి హృదయం తల్లడిల్లి పోతున్నది.

ఆమె భవిష్యత్తు ఈ ఒక్క రాత్రితో తేలిపోతుంది. గదంతా చాలా అందంగా అలంకరించబడివుంది. పూల దండల మత్తెక్కించే మధుర సౌరభాలూ, అగరు ధూపాల కమ్మని సువాసనలూ, ఎంతో మనోహరంగా వున్నాయి కానీ ఇవన్నీ పార్వతి హృదయానికి మరింత బాధను కలిగిస్తున్నాయి.

మెల్లిమెల్లిగా నెలవంక పైకి సాగివస్తున్నది. గదినిండా దీపాల కాంతులూ, గది బయట వెన్నెల వెలుగులూనూ. ఆమె హృదయంలో మాత్రం చీకటి తెరలు కమ్ముకుంటున్నాయి. ఏమి చేయడానికీ, ఎవరితోనైనా చెప్పుకునేందుక్కూడా వీల్లేని అవ్యక్త బాధ ఏదో ఆమెను క్రుంగదీస్తున్నది.

ముత్తయిదువులు ఒక్కొక్కరే వెళ్ళిపోయారు. పార్వతికింక ధైర్యం వహించక తప్పదు. శిధిలమైపోతున్న అవయవాలను కూడ దీసుకుని గదిలోకి వెళ్ళింది. కళ్లు పైకెత్తి చూడడానికామెకు ధైర్యం చాలడం లేదు. అతని మొహం ఎలా చూస్తుంది? కదిలిస్తే అశ్రువులు కార్చబోతున్న కళ్ళూ, వెలవెలబోతూన్న మొహమూ ఇవన్నీ అతను కనిపెడితే ఏం చేయాలి? కానీ వీటన్నిటికీ ఆస్కారం లేకుండా అతను కిటికీలోంచి ఎటో చూస్తున్నాడు

తలుపు గడియవేసిన పార్వతి చేతులు మెల్లిగా-అతిమెల్లిగా-కిందకు వాలాయి. అయినా గాజులు చిన్నగా మోగి వూరుకున్నాయి. అతను వెనుదిరిగి చూశాడు. కళ్ళకు మిరుమిట్లుగొలిపే సౌందర్యం. ఒకే ఒక్కసారి ఆమె మొహంలోకి నిశితంగా చూశాడు. హృదయాన్ని భేదించుతున్నట్లున్న ఆ చూపులు ఆమెకు వణుకు పుట్టించాయి. అతను దగ్గరకొస్తున్నకొద్దీ ఆమె తలుపు కంటుకుపోయింది. ఆమె పడే బాధ అతనికి కనిపిస్తూనే వున్నది. దగ్గరకొచ్చి ఒక్కొక్క పదమే స్పష్టంగా ఉచ్చరించాడు వెగటుగా—

"ఇంక అభినయం ప్రారంభమవుతుంది కదూ!" పార్వతి నెత్తిమీద పిడుగుపడ్డట్లు అదిరిపోయింది.

"ఏమిటి?" నివ్వెరపాటుతో అన్నది ఆమె. చంద్రం వికటంగా నవ్వాడు.

"ఇంకా నాకు తెలీదనే అనుకుంటున్నావు కదూ పాపం!"

కథానిక

పార్వతి కుప్పకూలినట్లు కూలిపోయింది. ఏ రహస్యంలో తన భవి

ష్యత్తు యిమిడివుందో అది కాస్తా అతనికి తెలిసిపోయిందన్నమాట! ఇప్పటివరకూ కూడ దీసుకుంటున్న ఆమె ధైర్యం పటాపంచలైంది. అణచిపెట్టిన కన్నీరు పైకుబుకుతున్నది. జాలి గొలిపే కళ్ళతో అతని వైపు చూసింది.

పులి ముందు నిల్చున్న మేకపిల్లలా వణికి పోతున్న ఆమెను చూసి అతనికి జాలి కలగ లేదు.

"నీ రహస్యం నాకెలా తెలిసిందని అనుకుంటున్నావు కదూ! వివాహమపుడే నా చేతిలో వున్న నీ చేయి వణికిపోయింది. నీ వాలకమంతా చూసి అప్పుడే కనుక్కున్నాను."

అతని మొహంలో ఆమెపట్ల తీవ్రమైన అసహ్యమూ, ద్వేషమూ కనిపిస్తున్నాయి. పార్వతి స్థాణువులా అయిపోయింది. చూస్తూనే చూడ నట్లూ అయిపోయిందామె పరిస్థితి.

అతనింకా చెపుతూనే వున్నాడు—

"తెలిసుండీ ఇంకా ఎందుకిక్కడున్నానని ఆలోచిస్తున్నావా? అదీ చెపుతాను. నువ్వు నన్నెలా బుట్టలో వేసుకునేందుకు ప్రయత్నిస్తావో చూద్దామనుకున్నాను. అయితే నీ మీదున్న అసహ్యంవల్ల అప్పటివరకూ ఆగలేక పోయాను. అయినా నేననుకున్నదానికంటే అభినయం ఓ మెట్టుపైనే వుంది."

అతని కంఠం కర్కశంగా, కసి తీర్చుకుంటున్నట్లుగా వుంది. మూగపోయిన గొంతుతో పార్వతి ఏంమాట్లాడుతుంది? కాళ్ళూ చేతులూ, నోరూ అన్నీ కట్టిపెట్టి బోనులో నిలబెట్టిన ముద్దాయి దగ్గర జవాబేమి వుంటుంది? అసలు జవాబు కోసం నిరీక్షించే స్థితిలో లేడు చంద్రం.

"ఈ కన్నీళ్ళూ, జాలి గొలిపే చూపులూ, అమాయకపు నటనా, ఇవన్నీ నన్ను భ్రమింపజేస్తాయని అనుకున్నావు. అవునా? అయితే పాపం దురదృష్టవశాత్తూ నీ ఎత్తు పారలేదు."

నిష్ఠురమైన ఈ అభియోగానికి బాకులు గుచ్చుకున్నట్లు బాధపడింది పార్వతి. అంత కంటే ఆమె చేయగలిగింది లేదు. అతను వెళ్ళిపోయాడు. మంచు బిందువులు కురిపిస్తూ అతి నిశ్శబ్దంగా విలపిస్తున్న వెన్నెలా, సన్నగాలులకు వణికిపోయే జాజిపూల తోరణాలూ, పార్వతి కారుస్తున్న కన్నీరూ—ఇవేవీ అతన్ని కరిగించలేక పోయాయి. అతన్ని ఆపి ఏమేమో చెబుదామనుకున్నది. తన తప్పేమీ లేదని తనస్థితికి తీసుకొచ్చిన కారణాలు వేరే వున్నాయనీ, తన్ను క్షమించమని అడుగుదామనీ ఎన్నో వూహించుకుంది. కాని దేనికీ అవకాశమివ్వకుండా అతను వెళ్ళిపోయాడు. కారే కన్నీటిని తుడుచుకునే శక్తి కూడా లేక పార్వతి వొరిగిపోయింది.

ఇంత కఠినమైన శిక్ష ఎందుకు విధించావని భగవంతుణ్ణి అడగడానిక్కాని, తనను నాశనం చేసిన వాళ్ళను నిందించడానిక్కాని, ఓపిక లేకుండా పోయింది ఆమెలో.

* * *

చంద్రం చెప్పిన సంగతి విని గోపాలానికి షాక్ తగిలినట్లయింది.

"అవును. ఆమె తల్లి కాబోతున్నది." నిశ్చలంగా చెప్పాడు చంద్రం.

"నిజమేనా?" నమ్మలేక అడిగాడు గోపాలం. చంద్రం శుష్కంగా నవ్వాడు. "నువ్వూహించలేక పోవచ్చు. కాని నిజంగా జరిగింది."

చంద్రాన్నిచూస్తే గోపాలానికెంతో బాధ కలిగింది. మిత్రుడుపడే వేదన అతని కర్థమయింది. అగ్నిపర్వతంలో 'లావా' మరుగుతున్నదని గ్రహించాడు.

చంద్రం కుర్చీలో నిలువలేక పోయాడు. లేచి తిరుగుతూ గోపాలంవైపు చూడకుండానే చెప్పుకుపోతున్నాడు.

"పెండ్లిరోనే నా కనుమానం వేసింది. రక్తం లేక పాలిపోయిన ఆమె మొహమూ, శరీరపు తీరూ ఆమె మాతృత్వాన్ని పొందబోతున్నదని చెప్పక చెపుతున్నాయి. గదిలో నా అనుమానం వెలిబుచ్చాను. నోటితో ఏమీ చెప్పలేదు కాని నాకు తెలిసిందని గుర్తించగానే కుప్ప కూలి పోయింది. అంతే. నేను బయటికొచ్చాను."

గోపాలం బరువుగా నిట్టూర్చాడు.

"అయితే తెలిసుండీ ఆమెను బాధించాలనే కదిలించావన్నమాట."

"అవును. అందుకే, అందువల్లయినా బాధ కొంత చల్లారుతుందని."

చంద్రం మొహంలో వ్యక్తమవుతున్న అసహ్యభావాన్ని గోపాలం స్పష్టంగా చూశాడు.

"అయితే అగ్ని చల్లారిందా?" గోపాలం ఏదో ఆలోచిస్తున్నట్లు అడిగాడు.

చంద్ర వుడికిపోయాడు.

"ఏమిటి నువ్వనేది? ఆమెచేసిన మోసానికి ప్రతీకారం చేయక్కర్లేదంటావా?"

గోపాలం శాంతంగానే వున్నాడు.

"ఆమె మోసం చేసిందా లేక మోసానికి గురయిందా?" చంద్రం అతని వాదానికి విస్తుపోయాడు. "నువ్వనేది పరిహాసానికా? లేక నిజమా గోపాలం?"

గోపాలం అలాగే చెప్పుకుపోయాడు.

"నిజమే. నీలాంటి నాలాంటి ఒక యువకునివల్లనే ఆమె మోసగించబడిందని గుర్తుంచుకో. వివాహం చేసుకుంటానని మభ్య పెట్టి, పురుషుడు స్త్రీలోని బలహీనతల్ని రేపి, వాంఛల్ని రెచ్చగొట్టి, తరువాత మోసగిస్తాడు. సంఘం స్త్రీని మాత్రమే దోషిగా నిరూపిస్తుంది. విచిత్రమేమిటంటే ప్రకృతికూడా మాతృత్వపు భారాన్ని వేసి వంచితురాలైన స్త్రీని వెలి కీడ్చుకొస్తుంది. అప్పుడా యువతి పరిస్థితి వూహించుకో. తల్లిదండ్రులూ, మిత్రులూ, చివరికి ఆమెకాగతి పట్టించిన యువకుడూ ఆమెను తిరస్కస్తారు. ఆమెగతి ఏంకావాలి?"

నిలదీసి అడిగిన ఈ ప్రశ్నకు చంద్రం విసుక్కున్నాడు:

"నీ ఉపన్యాసం బాగానేవుంది. అయితే నాపరిస్థితి నువ్వెందుకాలోచించవు? సంఘంలో నేనుమాత్రం తలెత్తుకు తిరగ్గలనా? ఎవడిబిడ్డనో నా బిడ్డని చెప్పుకు తిరగమంటావా? నువ్వు కూడా ఝలాంటి ఛండాలపు సలహా యిస్తావని నేను కలలోకూడా అనుకోలేదు."

గోపాలం నొచ్చుకునీ నొచ్చుకోనట్లే ప్రవర్తించాడు.

"నువ్విపుడు ఉద్రేకంలో వున్నావు చంద్రం—నేనేం చెప్పినా నీకు విపరీతంగానే వుంటుంది. అయినా ఒకటి మాత్రం ఆలోచించు. ఆమె జీవితమంతా నీమీదనే ఆధారపడివున్నది. ఆమె చేసింది తప్పుకాదని నేననడంలేదు. ఆ తప్పును క్షమించటంలోనే వున్నది నీ గొప్పదనం. తప్పు క్షమించబడినపుడు క్షమించినవారూ, క్షమించబడినవారూ ఎంతో హాయి ననుభవిస్తారు. పార్వతికి పుట్టిన బిడ్డను నీ బిడ్డగానే ప్రపంచానికి పరిచయంకానివ్వు. నష్టమేమున్నది? నీవంటి చదువుకున్నవాడు చెయ్యకపోతే ఇంకెవరు చేస్తారు ఈ పని?"

గోపాలం మెట్లుదిగి వెళ్ళిపోయాడు, చంద్రం కలగా పులగమైన ఆలోచనతో కూర్చీలో కూలబడ్డాడు.

* * *

శ్రావణ భాద్రపదాలు జంట కవులు ఆశు కవిత్వం చెప్పినట్లు విడవకుండా వర్షిస్తున్నాయి. మేఘ కన్యలు గుంపులు గుంపులుగా కూడి హృదయ భారాన్ని కన్నీటి రూపంలో వెలిబుచ్చుతున్నట్లు కురిసింది వర్షం. చంద్రం హృదయావేగంతో సతమతమయిపోతున్నాడు. ఆ మొదటి ఉద్రేకం తగ్గేసరికి అతనాలోచించటానికి బాధ్యుడయ్యాడు. మానసికమైన ఆందోళనతో అతని శరీరం శుష్కిస్తున్నది. గోపాలం అతని స్థితిచూసి విచారిస్తున్నాడు.

ఆరోజు ప్రొద్దుటినుంచీ ముసురు. మిత్రులిద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు. పైకిఏదో సంభాషణ కొనసాగిస్తున్నా ఇద్దరూ మనసులో దీర్ఘంగా ఆలోచిస్తున్నారు.

"టెలిగ్రామ్" వాకిటిలో పోస్టుమాన్ కేక వినిపించింది. ఇద్దరూ ఆదుర్దాగా బయటి కెళ్ళారు. చంద్రం టెలిగ్రాం అందుకుని చూశాడు. నిర్లిప్తంగా వుండాలనుకున్నాడు. కానీ అతనికి తెలీకుండానే అతని మొహం వివర్ణమయింది.

"సంగతేమిటి?" అన్నట్లుగా గోపాలం కళ్లు ప్రశ్నించాయి.

చంద్రం కళ్లు దించుకున్నాడు. బరువుగా నిట్టూర్చాడు. గోపాలం అతని చేతిలోంచి టెలిగ్రాం అందుకుని చూశాడు.

అప్రయత్నంగా ఒకరివైపొకరు చూసుకున్నారు. ఇద్దరూ ఒకటేఆలోచించారులావుంది

గోపాలం చంద్రంచేయి పట్టుకున్నాడు. "చూద్దాం పద. త్వరగా బయలుదేరు."

* * *

హాస్పిటల్లో పక్కకంటుకునిపోయి, చిక్కి శల్యమైవున్న పార్వతిని చూసి చంద్రం నిశ్చేష్టుడయ్యాడు. ఆమెను ఒక్కసారి చూడగానే నెలల తరబడీ మహావ్యాధితో క్రుంగిపోతున్నదని కనిపెట్టవచ్చు, మిత్రులిద్దరూ డాక్టర్ను కలుసుకున్నారు.

డాక్టరు చెప్పింది. "ఆమె ఏదో తీరని మనోవేదనతో బాధ పడుతున్నది. అందువల్లనే కాన్పు చాలా కష్టమయింది. ఆమె మనసుకు సంతోషం కలిగించే సంఘటన జరిగితే బ్రతకొచ్చు"

చంద్రం బరువుగా అపరాధివలె పార్వతి మంచం వద్దకు నడిచాడు. కళ్లు మూసుకుని పడుకున్నా పార్వతి మొహంలో బాధ వ్యక్తమవుతున్నది. చంద్రం మంచం మీదకు వంగి మెల్లగా "పార్వతీ" అని పిలిచాడు.

పార్వతి మూసుకుపోతున్న కళ్లు బలవంతాన తెరిచి చూసింది. చంద్రాన్ని చూడగానే ఆమె భయంతో రెప్పకూడా వేయలేకపోయింది. అతన్ని చూడగానే ఆమె హృదయంలోని గాయాలు రేగినట్లయింది.

చంద్రం నెమ్మదిగా, గాద్గదికమైన కంఠంతో అడిగాడు. "నన్ను క్షమించు పార్వతీ.నిన్నెంతో క్రూరంగా బాధపెట్టాను."

పార్వతి అతని వైపు విస్మయంతో చూసింది. ఆ చూపులు "ఇదికలా! నిజమా?" అని అడుగుతున్నట్లున్నాయి.

చంద్రం మళ్ళీ అన్నాడు "నిజంగా పార్వతీ! నన్ను క్షమించవూ!"

పార్వతి కళ్లు అశ్రుపూరితాలయ్యాయి. గుండెల్ని కరిగించే వేదనతో అన్నది "నేను క్షమించినా ఆ భారాన్ని మీరు మోయగలరు కాని....నేను...నే నెలా మోయగలను? క్షమించమని అడగడానికూడా వీల్లేని అపరాధం నాది."

మాలిన్యాన్ని కడిగివేస్తున్నట్లు పార్వతి కళ్ల నుండి బాష్పధారలు ప్రవహించాయి. చంద్రం కంఠం రుద్ధమైపోయింది. అతని హృదయం విశాలమయింది.

"గతమంతా పీడకలలా భావించు పార్వతీ! అంతా మరచిపో. మన జీవితంలో ఇక ఎలాంటి ఒడిదుడుకులూ రావు."

హృదయభారం తీరినట్లు అలసిన కన్నులు మూసింది పార్వతి. ఆమె మొహంలో కొత్త వెలుగునూ, కాంతినీ చూసిన చంద్రానికి శరీరమంతటా అమృతవాహినులు ప్రవహించినట్లయింది.

క్షమించి క్షమించబడటంలో ఎంత మాధుర్య మున్నదో చంద్రానికిపుడే అర్ధమయింది. ★

---

(8వ పేజీ తరువాయి)

క్రమశిక్షణతో కూడిన సంకల్ప బలం కావాలి. ఒకవేళ శాసనోల్లంఘనంవల్ల వెంటనే ప్రత్యక్ష ఫలితం కనిపించక పోవచ్చు, కాని పాలక వర్గాల దమననీతికి తలొగ్గినందువల్ల వచ్చే దానికంటె హెచ్చు నష్టం మాత్రం దీనివల్ల రాదు. అంతేకాదు. సత్యాగ్రహంలో పాల్గొన్నవారికి, దానిని చూచేవారికి, దీనిని గురించిన కధలు ఆనోట ఆనోట వినేవారికి నైతికంగాను, మానసికంగాను ఎంతో బలంకూడా కలుగుతుంది. కొత్త ఉత్తేజాన్ని యిస్తుంది."

"ఇక కొన్ని సంవత్సరాలలోనే సత్యాగ్రహం అనేది, కేవలం హృదయ పరివర్తన ద్వారా కానవప్పటికి ఏదో ఒక విధంగా పశ్చిమ దేశాలలో పలుకుబడిలోకి వచ్చేటట్టు కనిపిస్తున్నది. ప్రజలు, అందులోను జయింపబడిన దేశాలలోని ప్రజలు, ఏదో ఒక విధంగా రాజకీయ కార్యాచరణను కొనసాగించడానికి సత్యాగ్రహమనేది చక్కని ఆయుధం కాగలదు. మిలిటరీ బలంతో వున్న నాయకత్వంమీద సత్యాగ్రహం పనిచేయదనే వాదన చేయవచ్చు. అది కూడా నిజమే. కాని ఇతరత్రా రాజకీయోద్యమాలు యివ్వని గ్యారెంటీని సత్యాగ్రహం కొత్తగా యివ్వడం లేదు కనకనే అది నిష్ప్రయోజన మనడానికి వీలులేదు." దీనిమీద ఇంకా వ్యాఖ్యానం దేనికి?—"గౌరీశంకర్."